క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంతంలో కెరమెరి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అంజద్ పాషా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండుతున్న ఎండల దృష్ట్యా అనేక గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతీరోజు కెరమెరికి నిత్యావసర సరుకులు కొనుగోలుకు వస్తారని, అలాంటి వారి దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. నీటిని వృథా చేయకుండా ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి భీమయ్య, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రెబ్బెన: వేసవి ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా గోలేటి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంకరమ్మ అన్నారు. గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద గోలేటి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, పంచాయతీ కార్యదర్శి జలంధర్ పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

దహెగాం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం శనివారం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. మండలంలో సమస్యలు పరిష్కరించడానికి నిర్వహించే సమావేశం వాయిదా వేయడంతో సమస్యలు చర్చకు వచ్చి పరిష్కారమయ్యేదెప్పుడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొందరు కావాలనే సమావేశం వాయిదా పడేలా చేస్తున్నారని ఆరోపించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిచ్‌ధరి ఖానాపూర్ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని హత్తిగుట్ట, మారుగూడ, బోరింగ్‌గూడ మారుమూల గిరిజన గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, మర్సుకోల లక్ష్మీబాయి, హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేంసింగ్, సిబ్బంది నారాయణ, సత్యవతి, శైలజ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్

కైలాస్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 7న ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సెంట్రల్ గార్డెన్‌లో సాయంత్రం 6గంటలకు జరిగే విందుకు ఉపవాసాలు చేస్తున్న ముస్లింలతో పాటు కుల, మతాలకతీతంగా ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

నేరడిగొండ: మండలంలోని తర్నం(కె) గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న గుట్టపై పనులను చేపడుతున్నారు. పనులు ఎలా జరుగుతున్నాయో పని ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. కూలీలకు పనికి దగ్గ వేతనాలు అందించాలని సంబంధిత ఉపాధిహామీ అధికారులను ఆదేశించారు.

'రైతులపై బీజేపీది కపట ప్రేమ'

ఖానాపూర్: రైతు సమస్యలపై బీజేపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ నాయక్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ, పంజాబ్ రైతులు తమ సమస్యలపై రోడ్లపై నిరసన తెలిపితే రబ్బరుగుండ్లు, వాటర్ ట్యాంకర్లతో రైతుల ఆందోళనను అణిచివేశారని అన్నారు. ఇవన్నీ మరిచి రైతు సమస్యలపై సత్యాగ్రహ దీక్షలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. రైతుల గురించి మాట్లాడే బీజేపీ రైతులకు ఏం చేసిందో చెప్పాలన్నారు.

బీఎస్పీ అభ్యర్థిని గెలిపించాలి

ఆదిలాబాద్‌రూరల్: కార్యకర్తలు ఐక్యంగా ఉండి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవా లని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ పిలు పునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీఎస్పీ ముఖ్య కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒక్కొక్కరిగా వారి అభిప్రాయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధిష్టానం టిక్కెట్ ఎవరికి కేటాయించిన అందరూ కలిసి కట్టుగా ఉండి అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు.

ఫలంతో ఆరోగ్యానికి మేలు



మార్కెట్‌లో పండ్లు అమ్ముతున్న వ్యాపారి

- పండ్లలో ఎన్నో పోషకాలు
- ఔషధ విలువలూ సొంతం
- పుచ్చ, దోసకాయలకు భలే గిరాకీ





ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వేడిని తట్టుకోలేక చల్లని నీళ్లు, ఇతర పానీయాలతోనే కడుపు నింపుకుంటున్నాం. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, లేదంటే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండాకాలంతో పాటు ఇతర కాలాల్లోనూ పండ్లను ఎక్కువగా తీసుకోవడం ఉత్తమ మార్గమని వారు సూచిస్తున్నారు.

దోస, పుచ్చకాయలకు గిరాకీ..

వేసవిలో చల్లదనాన్ని ఇచ్చే దోస, పుచ్చకాయలకు గిరాకీ పెరిగింది. మార్కెట్‌లో ప్రస్తుతం ఈ పండ్లు తక్కువ ధరలో లభిస్తున్నాయి. పట్టణాల్లో పలు కూడళ్ల వద్ద తోపుడు బండ్లపై దోసకాయలు విక్రయిస్తున్నారు. కిలో ధర రూ.40 నుంచి రూ.50 అమ్ముతున్నారు. రోడ్డు పక్కన పుచ్చకాయలు కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. పుచ్చకాయలను చిన్న సైజుల్లో కట్‌చేసి చల్లని ఐస్‌పై పెట్టి విక్రయిస్తున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు దోస, పుచ్చకాయలను ప్రజలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఎక్కువగా జ్యూస్‌లు తాగుతున్నారు.

పండ్లలో పోషకాలు..

వేసవికాలంలో దోస, కీరదోస, తాటిముంజలు, ద్రాక్ష, కర్బూజ, సపోట, మామిడి, కొబ్బరి బోండాలు వంటివి మార్కెట్‌లలో ఎక్కువగా లభిస్తుంటాయి. పండ్లలో ఎన్నో పోషక విలువలు ఉంటాయి. పండ్లలో శరీరానికి మేలు చేసే పీచు పదార్థాలు, విటమిన్ ఏ, సీ, మినరల్స్, పొటాషియం, మెగ్నీషియం, జింక్, పాస్ఫరస్, ఐరన్, కాల్షియం ఫోలేట్ వంటివి అధికంగా ఉంటాయి. మార్కెట్‌లో ప్రస్తుతం కివి పండ్లు సైతం లభిస్తున్నాయి. వీటిలో 27 రకాల పండ్లలో లభించే పోషకాలు లభిస్తాయి. సహజసిద్ధంగా యాంటీ ఆక్సిడెంట్లను ప్రసాదించే అద్భుతమైన ఫలాలను తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్యులు పేర్కొంటున్నారు.

పండ్లతో ఆరోగ్యం



వేసవి కాలంలో కూల్‌డ్రింక్స్‌లు ఎక్కువగా తాగకూడదు. పండ్ల జ్యూస్‌లు, దోసకాయలు, పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. పండ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు లభించడంతో పాటు వేడి చేయకుండా ఉంటుంది.

– సత్యనారాయణ, వైద్యుడు

జ్యూస్‌కు గిరాకీ



పండ్ల జ్యూస్‌కు మంచి గిరాకీ ఉంది. రోజుకు రూ.1500 నుంచి రూ.2500 వరకు గిరాకీ అవుతుంది. మా వద్ద ఆరు రకాల పండ్ల జ్యూస్‌లు అందుబాటులో ఉన్నాయి. అరటి, యాపిల్, నిమ్మ, ద్రాక్ష, చెర్రి వంటి పండ్లతో జ్యూస్‌లు తయారు చేస్తున్నాం.

– హిమబిందు, జ్యూస్ సెంటర్ నిర్వాహకురాలు

మిషన్ వాత్సల్య అర్హుల పరిశీలన

పెంచికల్‌పేట్: మిషన్ వాత్సల్య పథకంలో అనాథలు, ఒంటరి విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్‌షిప్ అర్హుల జాబితాను శనివారం డీసీపీవో కార్యాలయం లీగల్ అడ్వైజర్ శ్రీనివాస్ పరిశీలించారు. 1 నుంచి 18 సంవత్సరాల వరకు అందిస్తున్న పథకంలో అర్హుల జాబితాను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ పథకంలో ప్రతి నెలా ఒక్కో విద్యార్థికి రూ.4వేలు స్కాలర్ షిప్ బ్యాంకులో జమ చేస్తామన్నారు. మండలంలో పది మంది విద్యార్థులకు స్కాలర్ షిప్ వచ్చినట్లు ఆయన తెలిపారు.



లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్న శ్రీనివాస్

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



ఎఫ్ఏతో వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: పని ప్రదేశాల్లో ఉపాధికూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో కృష్ణారావు, ఈజీఎస్ ఏపీవో మలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. 200మందికి పైగా కూలీలు పనిచేసే విధంగా చూడాలని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరగనున్న నేపథ్యంలో నీటి ఎద్దడి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో శుచి శుభ్రతతో పాటు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎంపీవో అంజద్ పాషా, ఈసీ ఐక్యనాయక్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



కవాతు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

జైనూర్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు శనివారం మండలంలో కవాతుతో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో పోచ్చంలొద్ది, జంగాం, దుబ్బగుడా పరిసర ప్రాంతాలలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మే 13న లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అల్లర్ల లేకుండా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జైనూర్ సీఐ అంజయ్య, ఎస్సై సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



దహెగాం: ఐనం గ్రామంలో బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు



సిర్పూర్ (టి): బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే వస్తుందన్నారు. పేద వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుల్గం నారాయణ, బొర్కుట్ మల్లేశ్, దెబ్బటి సత్యనారాయణ, విజయ్ పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శనివారం మండల బీజేపీ నాయకులు 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 122 పోలింగ్‌బూత్‌లలో బూత్ లెవల్ బీజేపీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్, నియోజకవర్గ అధికార ప్రతినిధి నీరటి సత్యనారాయణ, నాయకులు వడ్డేటి నానయ్య, నులిగొండ మహేశ్, రాచర్ల మహేశ్, మారుతి, దుర్గం ప్రశాంత్, బనార్కర్ సాయి, మనోజ్ మండల్, నులిగొండ రాజశేఖర్, బండ రవీందర్, బోయర్ రమేశ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వాంకిడి మండలం ఇందానీలో గల బూత్ నంబర్ 246లో పార్టీ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జి కోట్నాక విజయ్ ఆవిష్కరించారు. అనంతరం బూత్ నంబర్ 248 ఖడమార్గ్ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో టిఫిన్ బైటక్ కార్యక్రమం చేపట్టారు. నేషన్ ఫస్ట్ అనే నినాదంతో బీజేపీ పని చేస్తుందన్నారు. ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు విజయ్, రాంశావ్, ప్రకాశ్, అనిల్, చింటు, అంబదాస్, బొజ్జిరావ్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ తన ఇంటిపై పార్టీ జెండా ఆవిష్కరించారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల మాజీ అధ్యక్షుడు కోండ్ర మనోహర్ గౌడ్ బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 44ఏళ్ల ప్రస్థానంలో భారతీయ జనతా పార్టీ ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించిందన్నారు. మండల అధ్యక్షుడు బాలకృష్ణ యాదవ్, పాపన్‌పేట్ గ్రామ అధ్యక్షుడు పుజాడి మల్లేశ్, బూత్ అధ్యక్షుడు రౌతు చంటి, మహేశ్, తిరుపతి, రమేశ్, విలాస్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలోని ఎమ్మెల్యే హరీశ్‌బాబు నివాసంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం శిశుమందిర్‌లో బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు పాల్గొని కార్యకర్తలతో టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, ఉపాధ్యక్షులు అశోక్, కన్వీనర్ వీరభద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బెజ్జూర్: పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మనోహర్‌గౌడ్



బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న కోట్నాక విజయ్

శుద్ధజలానికి పరీక్ష



కిట్లను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందిస్తున్న అధికారులు

- నీటి నాణ్యత తెలుసుకునేందుకు క్లోరోస్కోప్ కిట్లు
- ప్రతీ గ్రామ పంచాయతీకి పంపిణీ
- సద్వినియోగం చేసుకోవాలని 'భగీరథ' అధికారుల సూచన

కెరమెరి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చింది. ఇంటింటికీ సరఫరా అవుతున్నా నీరు పైపులైన్లు, గేట్ వాల్వుల్లో లీకేజీలు, ట్యాంకుల్లో అపరిశుభ్రత వంటి కారణాలతో నీరు కలుషితమవుతుంది. కొన్ని చోట్ల బోర్లు, చేతిపంపులు, రక్షిత మంచినీటి బావుల నుంచి నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సరఫరా చేసే నీటి నాణ్యతను పరీక్షించేందుకు ప్రజలకు క్లోరోస్కోప్ కిట్లను అందించారు.

కిట్లు పంపిణీ..

గ్రామాలకు సరఫరా చేస్తున్న నీటిని పరీక్షించేందుకు ఒకటి చొప్పున క్లోరోస్కోప్ కిట్లను పంపిణీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు కిట్ల పంపిణీ జరిగింది. ఒక్కో కిట్‌లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించేందుకు రసాయనాలు, పరీక్ష నాళిక, నాణ్యతను సూచించే పత్రం, ఒక స్టాండ్, శుభ్రం చేసేందుకు బ్రష్ ఉన్నాయి.

పక్కాగా నమోదు..

గ్రామాల్లో తాగునీటి వనరులు రక్షిత మంచినీటి బావులు, ట్యాంకులు, బోరుబావులు, చేతిపంపులు, మినీవాటర్ ట్యాంకులు ఇలా ప్రతీనీటి వనరును రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వనరుల్లోని నీటిని కిట్ల సాయంతో పరీక్షలు చేయాలి. ఫలితాల ఆధారంగా నీటిని వినియోగించుకోవాలి. లేదంటే ప్రత్యామ్నాయ వనరుల ద్వారా తాగునీటి సరఫరా చేయాలి. నీరు తాగేందుకు సురక్షితం కాకుంటే మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వాలి.



క్లోరోస్కోప్ కిట్టు

వినియోగంపై అవగాహన..

భూగర్భజలాలు అడుగంటుతుండడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కిట్లు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు వాటర్‌మెన్‌లకు, కారోబార్లకు, బిల్ కలెక్టర్‌లకు కిట్లు అందించి చేతులు దులుపుకున్నారు. వారు పరీక్షలు చేయకపోవడంతో కిట్లలోని రసాయనాలు వృథా అయ్యాయి. గతంలో మాదిరి వృథా కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మండలాల వారీగా పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన



ఇప్పటికే అన్ని మండలాల్లో నీటి నాణ్యత పరీక్షలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించాం. ఎంత నీటి మోతాదులో.. ఎంత రసాయనం వేయాలి.. ఎలా పరీక్షలు చేయాలి అనే విషయాలపై వివరించాం.

– విశ్వేశ్వరరావు, ఏఈ

పాఠశాలలో వసతులు ఉండేలా చూడాలి

నేరడిగొండ: ప్రతీ పాఠశాలలో వసతులు ఉండేలా చూడాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శనివారం అమ్మ ఆదర్శ్ పాఠశాలపై ఐకేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో వసతులు ఉండేలా చూడాలన్నారు. తాగునీరు, పాఠశాల భవన మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, పారిశుధ్యం, విద్యార్థుల యూనిఫాం తదితర ఏర్పాట్లు ఉండేలా చూడాలని పాఠశాలల ఉపాధ్యాయులను ఆదేశించారు. సమావేశానికి ఎంఈవో భూమారెడ్డి, ఎంపీవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న శునకాలు

కౌటాల: గ్రామాల్లో వీధి కుక్కలు సృష్టిస్తున్న బీభత్సానికి పిల్లలు, పెద్దలు నానా అవస్థలు పడుతున్నారు. గుంపులుగా తిరుగుతూ ప్రజలు, మేకలు, గొర్రెల మందలపై దాడి చేస్తున్నాయి. శనివారం మండల కేంద్రంలో గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయందోళనకు గురి చేశాయి. కుక్కల బారి నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్డెక్కితే కుక్కలు భయపెడుతున్నాయి. అధికారులు వీటి నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వీధి కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారిపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

నిరసన దీక్షకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు



నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న నాయకులు

రెబ్బెన: రాష్ట్రంలోని రైతులు పండించిన యాసంగి వరి ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించాలని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా రైతులు పండించిన వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో పాటు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ, బోనస్ వంటి హామీలను అమలు చేయకపోవడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతీ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు దాసరి సాంబగౌడ్, మల్లేశ్, సయ్యద్ అసీఫ్ అలీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

తలమడుగు: మండలంలో పాఠశాలకు మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శేఖర్, ఎంఈవో నారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హెచ్ఎంలతో, అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఇతర పనులు పూర్తి చేయాలని కోరారు. పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తాహసీల్దార్ రాజమోహన్, ఏపీఎం స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో నారాయణ